










నవతరం సామాజిక వ్యాపారవేత్తలు - నింగినంటుతున్న ఆసుపత్రి ఖర్చుల్ని నేలకు దించే ప్రయత్నం చేస్తున్నారు. హృదయాన్నీ టెక్నాలజీనీ మిళితం చేసి...సరికొత్త పరిష్కారాలు చూపుతున్నారు.

జనాభా: 120 కోట్లకు పైగా

ఆరోగ్యబీమా ఉన్నవారు పాతికశాతం లోపే

6.13 కోట్లమంది

మధుమేహ రోగులు

6.2 కోట్లమంది

హృద్రోగ బాధితులు

10 కోట్లమంది

అధిక రక్తపోటు పీడితులు

మొత్తంగా భారతీయ వైద్య పరిశ్రమ విలువ - వేలవేల కోట్లు!

కార్పొరేట్ ఆసుపత్రిలో కాలుపెట్టడమంటే కష్టాల్ని కొనితెచ్చుకోవడమే. మాత్రల్ని మి


ంగడమంటే నోట్లకట్టల్ని ముద్దలు చేసుకుని ఆరగించడమే. వైద్య పరీక్షలంటే ఆర్థిక పరిస్థితికి విషమ పరీక్షే. 'సెకెండ్ ఒపీనియన్' అంటే గోటిచుట్టు మీద రోకటిపోటే. 'సూపర్ స్పెషాలిటీ' అంటే సుతిమెత్తని కత్తితో శిరోముండనమే. 'సర్జరీ' అంటే సగం దివాలా!

వైద్యం చాలాచాలా ఖరీదైన వ్యవహారంగా మారిపోయింది. ఇది - ఒకరికో, ఇద్దరికో సంబంధించిన సమస్య కాదు, పల్లెకో పట్టణానికో పరిమితమైన సంక్షోభం కాదు, చదువుకున్నవాళ్లూ చదువుకోనివాళ్లూ అన్న తేడా లేదు - ప్రతి ఒక్కరూ ఏదో ఓ స ందర్భంలో వైద్య వ్యాపార వలయంలో చిక్కుకుంటున్నవారే. అలా అని, వైద్యశాలలే ం ఉచితసేవలు చేయాల్సిన పన్లేదు. కాస్తంత లాభాన్ని తగ్గించుకున్నా చాలు, సామాన్యుడు వూపిరి పీల్చుకుంటాడు. ధైర్యంగా చక్రాల కుర్చీ ఎక్కుతాడు. దీనివల్ల కార్పొరేట్లకొచ్చిన నష్టమేం లేదు. దీర్ఘకాలంలో ఎంతోకొంత మేలే జరుగుతుంది. బోలెడంతమంది కొత్త కస్టమర్లు దొరుకుతారు. మేనేజ్‌మెంట్ నిపుణుడు సి.కె.ప్ర హ్లాద్ 'బాటమ్ ఆఫ్ ద పిరమిడ్' సూత్రం చెబుతున్నదీ అదే. నవతరం సామాజిక వ్యాపారవేత్తలు సాంకేతిక ప్రతిభతో, మెరుపులాంటి ఆలోచనలతో ఖరీదైన వైద్యాన్ని...ఎంతోకొంత తక్కువ ధరకు అందించే ప్రయత్నం ప్రారంభించారు. మార్కెట్ వ్యూహాల్నీ సామాజిక బాధ్యతల్నీ సమపాళ్లలో రంగరిస్తున్నారు. కొంచెం లాభం, కొంచెం సేవ మిళితం చేస్తున్నారు. తాము బతికేస్తూ, నలుగుర్నీ బతికిస్తున్నారు.



రుచులు

## క్యారెట్ బజ్జీ



కావల్సినవి:క్యారెట్లు: రెండు, సెనగపిండి: 2 కప్పులు, బియ్యప్పిండి: కప్పు, బేకింగ్‌సోడా: పావు టీస్పూను, ఉప్పు: టీస్పూను, నూనె: వేయించడానికి సరిపడా,

FULL STORY

సినిమా

## ఆ కోట్లన్నీ నాకు ఇవ్వడం లేదు కదా?



'నాయికలు పాటలకే పరిమితం' అనే మాట అనుష్కను చూసి ధైర్యంగా చెప్పలేం. ఎందుకంటే అనుష్క ఎప్పుడూ పాటలకే పరిమితం

కాలేదు. కత్తియుద్ధాలు చేయడానికి...

More..












ముంబయి
గురు 13:40

+29°C
17 kmh

ఇలా అనిపిస్తుంది: 29 °C
దృష్టి గోచరత: 4 km
తేమ: 45 %
తుషార స్థానం: 16 °C

వాతావరణ మాన చిత్రాలు

| గురు 17:30 | గురు 23:30 | శుక్ర 05:30 | శుక్ర 11:30 | శుక్ర 17:30 | శుక్ర 23:30 |
|---|---|---|---|---|---|
| 28° | 24° | 25° | 29° | 27° | 22° |
| 14 | 4 | 4 | 11 | 18 | 11 |

ప్రదేసమును మార్చడం ...

FORECA





విలువైన సలహా...

'వెంటనే ఆసుపత్రిలో చేర్పించండి...'
'రోగి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సిటీకి తీసుకెళ్తే మంచిది'
'మావంతు ప్రయత్నం చేశాం. ఈ విభాగంలో నిపుణుడైన ఓ డాక్టరు ఉన్నారు. ఆయన దగ్గరికి తీసుకెళ్లండి'
'నిజమే నేను స్పెషలిస్టునే. కానీ మీ సమస్య నా పరిధిలోకి రాదు'
'పరిధి నాదే. పడకలు ఖాళీలేవు'
'ఓపని చేయండి...'

ఒక్కో వైద్యశాలలో ఒక్కో సమాధానం. ఒక్కో వైద్యుడి దగ్గరా ఒక్కో స్పందన. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని ఒక ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికీ, ఆ ఆసుపత్రి నుంచి ఇంకో ఆసుపత్రికీ...తీసుకెళ్లలేక ఇందిరిట్టాసింగ్ నరకయాతన అనుభవించారు. ఆమె రాజస్థాన్‌లోని ఓ రాజకుటుంబానికి చెందిన యువతి. విదేశాల్లో చదువుకుంది. తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు. విదేశీ రాయబారిగా పనిచేశారు. పదవీ పలుకుబడీ డబ్బూ చదువూ...అన్నీ ఉన్న తమ పరిస్థితే ఇలా ఉంటే, సామాన్యుల గతేమిటీ? అనిపించింది. ఆ సామాజిక సమస్యకు పరిష్కారం వెతకడానికే ఇందిరిట్టా ఓ ఆసుపత్రి పరిపాలనా విభాగంలో చేరారు. సామాన్యులు తమ వైద్య సమస్యలు చర్చించుకోడానికి ఓ ఫేస్‌బుక్ ఖాతా తెరిచారు. ఆ అనూహ్య స్పందనే హాస్పిటల్ గైడ్ ఫౌండేషన్ (హెచ్‌జీఎఫ్) ఏర్పాటు దిశగా నడిపించింది.

సమస్య ఏమిటి, పరిష్కారాన్ని అందించే వైద్యసంస్థలు ఎక్కడున్నాయి, ప్రత్యామ్నాయ చికిత్సా మార్గాలేమిటి..ఇలాంటి ప్రాథమిక విషయాల్లో అవగాహన వచ్చేనాటికే రోగి ఆరోగ్యం చితికిపోతోంది. ఒక వైద్యుడి అపాయింట్‌మెంటే గగనమైన పరిస్థితుల్లో, ఎవరు మాత్రం ఇద్దరుముగ్గురు నిపుణుల్ని వెతుక్కుంటూ వెళ్తారు. వెళ్లినా...పక్కా వ్యాపారమయమైన రంగంలో ఏ వైద్యుడు నిజాయతీగా సలహా ఇస్తాడు. చికిత్స, శస్త్రచికిత్స - ఆతర్వాత. ముందు రోగికీ రోగి బంధువులకూ సరైన సలహా కావాలి. మార్గదర్శనం జరగాలి. ఆ బాధ్యతను హాస్పిటల్ గైడ్ ఫౌండేషన్ భుజానికెత్తుకుంది. మంచి సలహా డబ్బునూ ఆరోగ్యాన్నీ కూడా కాపాడుతుంది. ఇదో స్వచ్ఛంద ఆన్‌లైన్ వైద్య సలహా సంస్థ. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తోంది. రోగీ లేదా బంధువులూ హెచ్‌జీఎఫ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి...తమ సమస్య తాలూకు వివరాల్ని నమోదు చేయాలి. ఫౌండేషన్ ప్రతినిధులు ఆ మెయిల్‌ను పరిశీలించి...వైద్యుల్నీ వైద్య సంస్థల్నీ సిఫార్సు చేస్తారు. ఎంపిక రోగి వంతు. సాధారణంగా 72 గంటల్లోపే సమాధానం అందుతుంది. ప్రతిఫలాపేక్ష లేకుండా మాటసాయం అందించడానికి దాదాపు ఏడు వందలమంది వైద్యనిపుణులతో ఓ బృందాన్ని ఏర్పాటు చేసుకుంది హాస్పిటల్ గైడ్ ఫౌండేషన్. ఫేస్‌బుక్ వేదికగా నడుస్తున్న ఈ వైద్యసేవా ఉద్యమంలో ఇప్పటికే పాతికవేలమంది సభ్యులున్నారు. 'పీపుల్‌హెల్త్ ఇండియా' కూడా సరిగ్గా ఇలాంటి సహకారమే ఇస్తుంది. కాకపోతే, ఆ సంస్థకు ఇదో సామాజిక వ్యాపారం. ఆరోగ్య సమస్యకు సంబంధించి వివరమైన మెయిల్ ఇస్తే చాలు... పీపుల్‌హెల్త్ ఇండియా - అందుబాటులో ఉన్న వైద్యులూ వైద్యశాలలూ వగైరా వివరాలన్నీ పంపుతుంది. వివిధ ప్రత్యామ్నాయాల్ని మనముందు ఉంచుతుంది. దీనివల్ల, రోగికి బోలెడంత శ్రమ తగ్గుతుంది. 250 మందికిపైగా వైద్యులతో, 20 ఆసుపత్రులతో, వివిధ వ్యాధి నిర్ధారణ కేంద్రాలతో పీపుల్‌హెల్త్‌కు అవగాహన ఉంది. రోగులకు ఉచితంగా సమాచార సేవలు అందిస్తున్నా,

వైద్య సంస్థల నుంచి మాత్రం ఛార్జీలు వసూలు చేస్తుందీ సంస్థ. ఇప్పటికే తమ ద్వారా లక్షమందికిపైగా ప్రయోజనం పొందినట్టు పీపుల్‌హెల్త్ ఇండియా వ్యవస్థాపకుడు కపమూరి చెబుతునారు.



### చవకైన వైద్యం...

కొంతమేర లాభాల్ని తగ్గించుకుని, కొంతమేర వృథాను అరికట్టి, కొంతమేర వ్యయాలకు కళ్లెమేసి... ఆ మేరకు రోగికి ప్రయోజనం కలిగిస్తే, తక్కువ ధరకే వైద్యసేవలు అందిస్తే - ఒక ప్రాణం నిలబడుతుంది, ఒక వ్యాపారమూ నడుస్తుంది. గుడిబండ సందీప్ బృందానికీ సరిగ్గా అలాంటి ఆలోచనే వచ్చింది. ముగ్గురు మిత్రుల ప్రయోగం - నెఫ్రోప్లస్.

కమల్‌షాదో విషాద గాథ. తను హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తిచేసుకుని అమెరికా వెళ్లాడు. అక్కడే కిడ్నీ వ్యాధి బయటపడింది. తల్లి అవయవదానం చేశారు. అయినా ఫలితం కనిపించలేదు. కొత్త కిడ్నీకీ సమస్య సోకింది. రోజూ డయాలసిస్ అవసరమయ్యేది. కాస్త ఆరోగ్యం కుదుటపడ్డాక, గాలిమార్పు కోసం స్నేహితులతో కలిసి మహాబలిపురం వెళ్లాడు. అప్పుడే, సునామీ వచ్చింది. అతనున్న రిసార్ట్‌లోకి నీళ్లొచ్చేశాయి. డయాలసిస్ వ్యవస్థ పాడైపోయి...ఇన్ఫెక్షన్‌కు గురయ్యాడు. అదో నరకం! ఆ సంక్షోభ సమయంలోనే, తన అనుభవాల్నీ ఆలోచనల్నీ పంచుకోడానికి ఓ బ్లాగు తెరిచాడు.






ఉప్పుల విక్రమ్ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చదువుకున్నాడు. ఆతర్వాత, చికాగోలోని బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ నుంచి పట్టా అందుకున్నాడు. పదేళ్లపాటూ అమెరికాలో ఉన్నాడు. ఎనిమిదేళ్ల క్రితం దగ్గరి బంధువొకరు తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి పాలైనప్పుడు.. మొదటిసారిగా తనకు భారతీయ వైద్యశాలల స్థితిగతులు అర్థమయ్యాయి. కిడ్నీ రోగులకైతే, నాణ్యమైన డయాలసిస్ కూడా కరవే. ధర తక్కువైతే నాసిరకం సేవలు, సేవల్లో నాణ్యత ఉంటే ఆకాశాన్నంటే ధరలు. సరిగ్గా అప్పుడే, ఉస్మానియా పూర్వ విద్యార్థి కమల్‌షా తన బ్లాగులో రాసుకున్న స్వీయ అనుభవాలను చదివాడు విక్రమ్. ఆ రాతలు ఆలోచింపజేశాయి. తనే వెళ్లి పరిచయం చేసుకున్నాడు. ఇద్దరూ మంచి స్నేహితులుగా మారిపోయారు. విక్రమ్ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ఏదో సెమినార్‌లో పాల్గొనడానికి వెళ్లినప్పుడు, గుడిబండ సందీప్ పరిచయం అయ్యాడు. ఆ ముగ్గురు యువకుల చొరవతో...హైదరాబాద్‌లో నెఫ్రోప్లస్ ప్రారంభమైంది. తక్కువ ధరలో నాణ్యమైన సేవల్ని అందించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో టెలివిజన్, వైఫై వంటి సౌకర్యాల్నీ కల్పించారు. 'ఏ దాతలో స్పాన్సర్ చేస్తే ఫీజు తగ్గించడం కాదు...యంత్ర సామగ్రిని సమర్థంగా వాడుకోవడం ద్వారా, దుబారా నివారించడం ద్వారా...కార్పొరేట్ ఆసుపత్రులకంటే తక్కువ ధరకే డయాలసిస్, ఇతర వైద్య సేవలు అందిస్తున్నాం' అంటారు సందీప్. రోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడం అన్నది వైద్యంలో ఓ భాగమని నమ్మతుంది ఆ మిత్రత్రయం. అందుకే, డయాలసిస్ మీదున్న రోగుల మనోల్లాసానికి ప్రత్యేకంగా యాత్రలు నిర్వహిస్తోంది. ఉద్యోగ వ్యాపారాలు చేసుకునేవారికి ఇబ్బంది కలగకుండా..ప్రత్యేకంగా రాత్రిళ్లు డయాలసిస్ సౌకర్యాన్ని అందిస్తోంది. రోగుల కోసం, సంరక్షకుల కోసం అవగాహన శిబిరాలూ ఉపన్యాస కార్యక్రమాలూ చేపట్టింది.

### 'డిస్కౌంట్' సేవలు...

ఔషధాల ధరలు చుక్కల్ని తాకుతున్నాయి. ప్రభుత్వ విధానాల కారణంగా, ఐదూ పదిశాతం డిస్కౌంట్లు కూడా ఆగిపోతున్నాయి. ఏ జ్వరమో దగ్గో అయితే ఫర్వాలేదు. ఒకటిరెండు గోళీలతో పనైపోతుంది. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న

వారి పరిస్థితి అలా కాదే. మాత్రలు లేకపోతే రోజుగడవదు. నెలనెలా మందుల బడ్జెట్ కేటాయించుకోవాల్సిందే. ఆ ఖాతాలో ఎంతోకొంత మిగిలినా - రోగికి సంతోషమే. ఆ దిశగా తనవంతుగా ఏమైనా చేయలేనా అన్న ఆలోచనే మల్లారపు చంద్ర కిరణ్‌ను ఔషధాల వ్యాపారంవైపు నడిపించింది. మూడునాలుగేళ్లక్రితం అమెరికా నుంచి తిరిగొచ్చిన ఆ యువకుడు... కేన్సర్, మధుమేహం, అధిక రక్తపోటు వంటి దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్నవారిని దృష్టిలో ఉంచుకుని 'మెడ్‌స్టార్.ఇన్'ను ప్రారంభించాడు. సాధారణ మందుల దుకాణాలు ఔషధాల విక్రయాలకే పరిమితం అవుతున్నాయి. మహా అయితే, డోర్ డెలివరీ సౌకర్యాన్ని కల్పిస్తాయి. చంద్రకిరణ్ ఇంకాస్త ముందుకెళ్లి ఫోనే కాదు...మందుచీటీ స్కాన్‌చేసి, మెయిల్ చేసినా ఔషధాలు ఇంటికి పంపుతారు. ఫ్యాక్స్ చేసినా స్పందిస్తారు. మందుల మీద పదిహేను నుంచి ముప్పై శాతం డిస్కౌంట్ ఇస్తున్నారు. 'ఔషధాలు నిండుకున్నాయే!' అని నాలుక కరుచుకోవాల్సిన అవసరం ఉండదు. సంక్షిప్త సందేశాల ద్వారా ఎప్పటికప్పుడు గుర్తుచేస్తుంటారు. జీవనశైలికీ ఆహార విధానాలకూ సంబంధించి సలహాలూ సూచనలూ అందుతుంటాయి. సంస్థ ప్రతినిధులు గడపదాకా వచ్చి, ఉచితంగా రక్తపోటూ మధుమేహ పరీక్షలూ నిర్వహిస్తారు. 'ఈ నమూనా అమెరికాలో విజయవంతమైంది. హైదరాబాద్ ప్రజలూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అంటాడా యువకుడు. రెడ్‌క్రాస్ వంటి సంస్థలు హైదరాబాద్‌లో 'జీవనాధార సంజీవని' ఔషధ దుకాణాల ద్వారా...తక్కువ ధరకే జనరిక్ మందులు అందిస్తున్నాయి. ఈ ప్రయోగమూ విజయవంతం అవుతోంది.



### సృజనాత్మక వైద్యం

వైద్యం భరించలేనంత ఖరీదైపోవడం కొందరి సమస్య. ఆ ఖరీదును భరించే స్తోమత ఉన్నా...వైద్యానికో వైద్యపరీక్షలకో వెళ్లలేనంత ఒత్తిడి, నిర్లిప్తత, నిర్లక్ష్యం మరికొందరి సమస్య. అదెంత తీవ్రమైందో, ఇదీ అంతే తీవ్రమైంది. శ్వేతాంక్‌వర్మ, రాహుల్ బాత్రా, సచిన్ గనోర్కర్...తగినంత డబ్బున్నా అనేకానేక కారణాలతో వైద్యానికి దూరంగా ఉన్నవారిని దృష్టిలోపెట్టుకుని 'మైహెల్త్‌మేట్.ఇన్'ను స్థాపించారు. ప్రవాసులైతే, భారత్‌లోని కన్నవారి బాధ్యతల్ని కూడా అప్పగించవచ్చు. కుటుంబానికంతా ఏడాదికోసారి వైద్య పరీక్షలు చేయించాలని ఏ కొత్త సంవత్సరమో తీర్మానించుకుంటారు చాలామంది. తర్వాత ఆ సంగతే గుర్తుండదు. మైహెల్త్‌మేట్ కేవలం గుర్తుచేయడంతోనే తన బాధ్యత తీరిపోయిందని అనుకోదు. డాక్టర్ల అపాయింట్‌మెంట్ తీసుకుంటుంది. వైద్యపరీక్షలు జరిపిస్తుంది. ఆతర్వాత... నిపుణుల సలహాలూ సూచనలూ అందిస్తుంది. మెడికల్ రికార్డుల్ని కూడా నిర్వహిస్తుంది. హైదరాబాద్, గుర్గావ్ నగరాల్లో వైద్య కేంద్రాలున్నాయి. సేవల్ని బట్టి ఫీజులుంటాయి.

కొన్నిసార్లు తలనొప్పి, జలుబు, ఓమోస్తరు జ్వరం వంటి చిన్నచిన్న సమస్యలు కూడా ఇబ్బంది పెట్టేస్తుంటాయి. డాక్టరు దగ్గరికి వెళ్లే ఓపిక ఉండదు, వెళ్లినా గంటల తరబడి వరుసలో కూర్చునే శక్తి ఉండదు, ట్రాఫిక్ మహమ్మారిని దాటుకుని అంతదూరం వెళ్లడమన్నది మరో తలనొప్పి. డాక్టర్లు ఇంటికొచ్చి వైద్యం చేసే రోజులు ఎప్పుడో పోయాయి. మరెలా? ఈ సకుటుంబ సమస్యకు ఓ టెలీ పరిష్కారం అందిస్తోంది 'మేరా డాక్టర్'. ప్రస్తుతానికి ఈ సేవలు ముంబయి వాసులకే పరిమితం. ఏడాది ఫీజు రెండువేల రూపాయలు. మొత్తం కుటుంబానికంతా వర్తిస్తుంది. ఏ చిన్న సమస్య వచ్చినా, ఓ మిస్డ్‌కాల్ ఇస్తే చాలు. కాసేపట్లో డాక్టరుగారి నుంచి ఫోన్ వస్తుంది. ఇలాంటి వైవిధ్యమైన పరిష్కారాల ద్వారా ఉరుకులు పరుగుల ఆధునిక జీవితానికి వైద్యసేవల్ని దగ్గర చేస్తున్నారు నవతరం మెడికల్ ఎంట్రప్రెన్యూర్స్!

### మురికివాడలకు ఆసరా..

ఉన్నపళంగా ఎదురయ్యే భారీ ఆసుపత్రి ఖర్చులు దిగువ మధ్యతరగతివారిని పేదల్ని చేస్తున్నాయి. పేదల్ని నిరుపేదలుగా మారుస్తున్నాయి. మహానగరాల్లోని మురికివాడల ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోడానికి అనారోగ్యమూ ఓ కారణమని చెబుతారు 'స్వస్థ్ ఇండియా' ప్రతినిధులు. అందులోనూ నగరాల్లో రోడ్డు ప్రమాదాల వంటి సమస్యలెక్కువ. బీమా సౌకర్యం ఉన్నవారు అతికొద్దిమంది. ప్రభుత్వ వైద్యశాలల పరిస్థితి అంతంతమాత్రమే. స్వచ్ఛంద సంస్థల సాయమంటే అదృష్ట పరీక్షే! ఈ పరిస్థితుల్లో...సామాన్యులు సైతం ధైర్యంగా ఆసుపత్రిలో కాలుపెట్టగల వాతావరణాన్ని కల్పించాలన్నది స్వస్థ్ ఇండియా ఆశయం. వైద్యం, మందులు, వైద్య పరీక్షలు...అతి తక్కువ ధరకు అందించడం ద్వారా ఈ సంస్థ ముంబయి ప్రజల ఆదరణ పొందుతోంది. దాదాపు పన్నెండు శాఖలు వివిధ మురికివాడల్లో పనిచేస్తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులతో పోలిస్తే, నలభైశాతం తక్కువ ధరకే సేవలు అందిస్తోంది 'స్వస్థ్ ఇండియా'. అవసరమైతే, రుణ సదుపాయాన్నీ కల్పిస్తుంది. అంకుర్, అరవింద్, సందీప్ అనే ముగ్గురు ఐఐటీ సహపాఠీల సామాజిక వ్యాపారమిది.



## సాంకేతిక సాయం...

ఏదో ఆరోగ్య సమస్య. డాక్టరు దగ్గరికి వెళ్తాం. మందులిస్తాడు. వాటిలో కొన్ని మన ఒంటికి పడవని, ఒకట్రెండు బిళ్లలు వాడాక కానీ తెలియదు. మళ్లీ వెళ్తాం, మళ్లీ వరుసలో కూర్చుంటాం. ఈసారి కొత్తమందులిస్తాడు. ఆతర్వాత కొన్నాళ్లకు ఇంకేదో

అనారోగ్యం. ఇంకో డాక్టరు దగ్గరికి వెళ్తాం. ఏవో పరీక్షలు చేయిస్తాడు. మరికొన్నాళ్లకు మరేదో జబ్బు. సంబంధిత నిపుణుడిని వెతుక్కుంటూ బయల్దేరతాం. ఆయనకు మళ్లీ కొత్త. మొదటి సమస్యకూ మూడో సమస్యకూ ఎక్కడో చిన్న లంకె ఉండవచ్చు. దాన్నెవరు గుర్తించాలి? మన వైద్య చరిత్ర అంతా...ఓ రికార్డు రూపంలో అందుబాటులో ఉంటే, ఇన్ని ఇబ్బందులు ఉండవు. ఓ ఔత్సాహికుడి ఆ ప్రయత్నమే చేస్తున్నాడు. ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి పట్టా అందుకున్న రియాద్ రషీద్ 'డి-వైజ్' అనే సంస్థ ద్వారా ఈ ప్రాజెక్టుకు రూపం ఇస్తున్నాడు. ఇ-క్లినికల్ స్టేషన్ సాఫ్ట్‌వేర్‌తో రోగికీ నాలుగు డబ్బులు మిగుల్తాయి. వైద్యశాలలు కూడా మరింత సమర్థంగా సమస్యను బేరీజు వేయగలవు. రోగి తత్వానికి సరిపడని ఏ చిన్న మందును సిఫార్సు చేసినా...సిస్టమ్ హెచ్చరికలు చేస్తుంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఇప్పటికే బెంగళూరులోని తొమ్మిది వైద్యశాలలు ఉపయోగిస్తున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు.

చికిత్సలకో శస్త్రచికిత్సలకో పరిమితం కాకుండా, సమస్య మూలాల్లోకి వెళ్తున్నారు సామాజిక వ్యాపారులు. అనారోగ్యం పాలైన తర్వాత కాదు...ఆ సమస్యే రాకుండా జాగ్రత్తపడాలనే కోణంలోంచి ఆలోచిస్తున్నారు. నూటికి యాభైశాతం రోగాలకు నీరే ఆధారం కాబట్టి... పరిశుద్ధమైన మంచినీళ్ల కోసం చవకైన ఫిల్టర్లను తయారు చేస్తున్నవారూ, గ్రామీణ ప్రాంతాల్లో సుశిక్షితులైన నర్సుల సాయంతో టెలీమెడిసిన్ ప్రాజెక్టులు చేపడుతున్నవారూ, పోషక విలువల లోపంపై దృష్టిపెడుతున్నవారూ -కాస్త సేవ, కాస్త వ్యాపారం, కాస్త సామాజిక బాధ్యత కలగలిపి ఎవరి దార్లో వారు ముందుకెళ్తున్నారు. ఇదో గొప్ప మార్పు అనీ, అద్భుతాలు జరిగిపోతున్నాయనీ అనలేం. జరగాల్సింది ఎంతో ఉంది, పెరగాల్సిన చైతన్యమూ చాలా ఉంది. ఒకటి మాత్రం నిజం.

ఓ మంచి మార్పునకు ఇదో సంకేతం!
వేయిమైళ్ల ప్రయాణానికి ఇదొక తొలి అడుగు.

## 'సామాజిక' ఆసుపత్రులు

సాంకేతిక పరిజ్ఞానంలో, నైపుణ్యంలో, అనుభవంలో - ఏ కార్పొరేట్ వైద్యశాలకూ తక్కువకాకపోయినా ... సామాన్యులకు అందుబాటు ధరల్లో వైద్యాన్ని అందిస్తున్న ఆసుపత్రులూ ఉన్నాయి. అలా అని, అవేం స్వచ్ఛంద సేవ చేయడం లేదు. స్పేస్ మేనేజ్‌మెంట్ ద్వారా...తక్కువ స్థలంలోనే ఎంతోకొంత సౌకర్యంగా ఎక్కువ పడకల్ని అమర్చడం, వేలవేల జీతాలతో నిపుణుల్ని నియమించుకోకుండా స్థానికులకే శిక్షణ ఇవ్వడం, దళారీల బారినపడకుండా తయారీదారుల నుంచే మందులూ పరికరాలూ కొనడం, వృథాను అరికట్టడం, అలంకరణలకూ ప్రచారానికీ పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం, భారీ లాభాల్ని ఆశించకపోవడం- తదితర మార్గాల్లో

మార్కెట్‌లో నిలదొక్కుకుంటున్నాయి.

### లైఫ్‌స్ప్రింగ్

ప్రాథమిక వైద్యాన్నీ ప్రసూతి సేవల్నీ చక్కని నాణ్యతతో సాధ్యమైనంత తక్కువ ధరకే అందించాలన్నది లక్ష్యం. హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల్లో శాఖలు ఉన్నాయి.

### అరవింద్ నేత్ర వైద్యశాల

శాస్త్రీయమైన నిర్వహణా సూత్రాలతో...మానవవనరుల్నీ సాంకేతిక వనరుల్నీ సమర్థంగా ఉపయోగించుకుంటూ అటు సేవలోనూ, ఇటు వ్యాపారంలోనూ ముందుంది. తమిళనాడులోని మదురై కేంద్రంగా పనిచేస్తోంది.

### వాత్సల్య

గ్రామీణ, ఓమోస్తరు పట్టణ ప్రాంతాల్లో అందరికీ అందుబాటులో ఉండేలా వైద్యాన్ని అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో శాఖలున్నాయి.

### గ్లోకల్ హెల్త్‌కేర్

పశ్చిమ బెంగాల్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే విస్తరిస్తోంది. ఐఏఎస్ అధికారి డాక్టర్ అజీమ్...ఉద్యోగానికి రాజీనామా చేసి, సామాన్యుల కోసం స్టెతస్కోప్ పట్టారు.

### నారాయణ హృదయాలయ

హృద్రోగ చికిత్సలో పేరుపొందిన సంస్థ. వ్యవస్థాపకులు డాక్టర్ దేవిశెట్టి సామాజిక వైద్య వ్యాపారానికి ఆద్యులుగా నిలుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల్లో శాఖలున్నాయి.

### విజన్‌స్ప్రింగ్

ప్రతి మొహానికీ ఓ కళ్లజోడు - నినాదంతో ఈ సంస్థ అతి తక్కువ ధరకే కళ్లజోళ్లు అందిస్తోంది. పల్లెపల్లెకూ విజన్‌ప్రెన్యూర్స్‌ను నియమిస్తూ...సామాజిక కళ్లజోడు వ్యాపారుల్ని ప్రోత్సహిస్తోంది.

## చవకైన పరికరాలు...





స్కానింగ్ యంత్రాన్ని మార్కెట్ ధరలో సగానికే అందించలేమా? ఈసీజీ మెషీన్ను స్థానికంగానే ఎందుకు తయారు చేయలేం? ...ఖరీదైన వైద్యాన్ని నేలకు దించాలంటే, చవకైన పరికరాలతోనే సాధ్యం. ఆ దిశగా అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. బెంగళూరుకు చెందిన ఫణికర్, మూర్తి ఈమధ్యే నవజాత శిశువులకు వెచ్చదనాన్నిచ్చే పరికరాన్ని నామమాత్రపు ఖర్చుతో తయారుచేసి 'ఎకానమిస్ట్ ఇన్నొవేషన్ అవార్డు' గెలుచుకున్నారు. ఇలాంటి ఇన్‌క్యుబేటర్లు అందుబాటులో లేక... గంటకు 340 మంది శిశువులు మరణిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా. జి.ఇ. హెల్త్‌కేర్ వంటి సంస్థలు మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లడానికి అనువైన పోర్టబుల్ ఎక్స్‌రే పరికరాన్నీ, విడిగా తీసుకెళ్లి బిగించుకోడానికి వీలైన సీటీ స్కాన్ యంత్రాన్నీ, పర్సనల్ కంప్యూటర్ సాయంతో పనిచేసే ఆల్ట్రాసౌండ్ వ్యవస్థనూ చవగ్గా రూపొందిస్తున్నాయి. 3నేత్ర అనే సంస్థ...చవకైన నేత్ర పరీక్ష యంత్రాన్ని ఆవిష్కరించింది. భారతీయ వైద్య పరిశోధనా మండలి.. మధుమేహరోగులు గ్లూకోజు పరీక్షలో వాడే పట్టీని ఐదు రూపాయలకంటే తక్కువ ధరకే అందించబోతున్నట్టు ప్రకటించింది. ఇవన్నీ అద్దాలమేడ వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నాలే.






## ఈవారం మీ రాశి

| | | |
|---|---|---|
| మేషం | సింహం | ధనుస్సు |
| వృషభం | కన్య | మకరం |
| మిధునం | తుల | కుంభం |
| కర్కాటకం | వృశ్చికం | మీనం |

Top ↑ | previous page





Copyright © 2013 Ushodaya Enterprises Pvt. Ltd., All Rights Reserved.
For Digital Marketing enquiries contact 9000180611 or Mail :Marketing@eenadu.net